క్లుప్తంగా

నిర్దేశించిన కొలతల ప్రకారమే పనులు



మానవపాడు: నిర్దేశించిన కొలతల ప్రకారమే ఉపాధి హామీ పనులు చేయాలని ఎంపీడీఓ రమణారావు అన్నారు. గురువారం మండలంలోని చండూరు, పల్లెపాడు, బోరవెల్లి తదితర గ్రామాలలో చేస్తున్న ఉపాధి హామీ కూలీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవికాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయరెడ్డి, సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి



మానవపాడు: ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ యాకుబ్ బాషాఅన్నారు. గురువారం మండలంలోని పల్లెపాడులో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 135 మందికి కంటివెలుగు పరీక్షలు నిర్వహించగా, 40మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 39 మందికి కంట అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ రమణారావు, ఎంపీఓ ఆంజనేయరెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి, ఆనంద్‌రెడ్డి, వైద్య సిబ్బంది చంద్రన్న, శ్రావణి, జయమ్మ, ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు



అయిజ: రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరిగా చేయాలని ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు అన్నారు. గురువారం మండలంలోని తూంకుంట, యాపదిన్నె సబ్‌సెంటర్లలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో ఆయన సమీక్ష చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం బీపీ, షుగర్ రోగలకు స్క్రీనింగ్ చేశారు. మే 1 నుంచి 10 తేదీలోపు ఏఎన్ఎంల ద్వారా స్క్రీనింగ్ చేసి మందలను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్సీడీ కోఆర్డినేటర్ శ్యాంసుందర్, వివిధ సబ్ సెంటర్‌ల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గ్రాట్యుటీ చెల్లించాలి



గద్వాల అర్బన్: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గ్రాట్యుటీ చెల్లించాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ హేమలతకు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలన్నారు. అదేవిధంగా పదవీ విరమణ పొందిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మోహనమ్మ, నర్సమ్మ, శారద, వనజ, సౌభాగ్య తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శేషదాసుల ఆరాధనోత్సవాలు



మల్దకల్: మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శేషదాసుల 138వ ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం పంచామృతాభిషేకం, ధన్వంతరి హోమం చేశారు. కర్ణాటకకు చెందిన మహిళ భజన మండలి సభ్యులతో ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాయచూరుకు చెందిన జయతీర్థచారి భక్తులకు దాసుల వారి ప్రవచనాలను వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ధీరేంద్రదాసు, రాఘవేంద్రదాస్, శేషగిరిరావు చర్యలు తసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, శశాంక, విష్ణు, అరవిందరావు, బాబురావు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

నారు దశలోనే తెగులు

- తగ్గిన వరి దిగుబడి
- పెట్టుబడి కూడా రాక రైతన్నల అవస్థలు
- నియోజకవర్గంలో 10,189 ఎకరాల్లో వరిసాగు



ఆరబెట్టిన వడ్ల కుప్పలు



కొండేరులో నేలకొరిగిన వరిపైరు

ఎర్రవల్లిచౌరస్తా: యాసంగి సాగులో భాగంగా అలంపూర్ నియోజకవర్గం ఆయకట్టు రైతులు వరి పంటను అధికంగా సాగుచేశారు. ఈ సారి వర్షాలు, వాతావరణం సక్రమంగా అనుకూలించక పోవడంతో నారు దశ నుండే అధికంగా తెగుళ్ల సోకడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. యాసంగిలో నియోజకవర్గంలోని 5,698 మంది రైతులు 10,189 ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. పొలాన్ని దున్ని చదును చేయడం, వరినాటు పెట్టడం, ఎరువులు వేయడం, కలుపులు తీయడం, పురుగు మందుల పిచికారీ చేయడంతో మొత్తం ఎకరాకు రూ. 30 నుంచి రూ.35 వేల వరకు వ్యయం కాగా అధికంగా తెగుళ్ల సోకడంతో పంట దిగుబడి మాత్రం ఎకరాకు 15 నుంచి 20 బస్తాలు మాత్రమే వస్తుందని రైతులు వాపోతున్నారు. కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి కష్టపడి పండించిన పంటలు పెట్టుబడులకు కూడా రాని దుస్థితి నెలకొంది. నియోజకవర్గంలో ఆర్ఎన్ఆర్ 15048, ఎంటీయూ 1010 వరి రకాలను రైతులు యాసంగిలో అధికంగా సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దిగుబడి తగ్గడంతో పాటు వడ్లను కూడా ధాన్యాన్ని బట్టి దళారులు ధరను నిర్ణయించడంతో దిక్కుతోచని స్థితిలో అమ్ముకోవాల్సి పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేవలం సన్న రకాన్ని మాత్రమే మద్దతు ధరను ఇచ్చి కొనుగోలు చేస్తుందని వాపోయారు. ఇతర పంటలకు మద్దతు ధర ప్రకటించకపోవడంతో దళారులను ఆశ్రయించక తప్పలేదని పలు గ్రామాల రైతులు తెలిపారు. ప్రభుత్వం ఏ1 గ్రేడ్ రూ. 2060, సాధారణ రకం రూ. 2040లు మద్దతు ప్రకటిస్తే దళారులు మాత్రం ధాన్యంలో తేమశాతాన్ని బట్టి ధరను నిర్ణయించి మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ. 1800 నుంచి రూ. 2000 వరకు మించి కొనుగోలు చేశామని రైతులు పేర్కొన్నారు.

మండలాల వారీగా వివరాలు

మండలం	రైతులు	వరిసాగు ఎకరాలలో
ఇటిక్యాల	1050	2084
మానవపాడు	12	41
ఉండవెల్లి	00	00
అలంపూర్	11	22
రాజోళి	852	1479
వడ్డేపల్లి	362	546
అయిజ	3411	6017

పెట్టుబడి కూడా రావడం లేదు



ఐదు ఎకరాలలో వరిపంటను సాగు చేశాను. మొదటి నుంచి అన్ని రకాలుగా పంటను కాపాడుకోవడానికి మొత్తం పంటకు రూ. 1,60,000 వరకు ఖర్చు చేశాం. వాతావరణం కారణంగా మొదటి నుంచే పంటకు తెగుళ్ల సోకింది. దిగుబడి తగ్గింది. పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడింది.

– కాంతారెడ్డి, రైతు, షేకుపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



అన్ని రకాల వరి ధాన్యానికి మద్దతు ధరను ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. మండలంలో రైతులు అధికంగా సాగుచేసిన 1010, ఆర్ఎన్ఆర్ రకాలకు అధికంగా తెగులు సోకి దిగుబడి తగ్గింది. ఏ గ్రేడ్ ధర మాదిరి మద్దతుధర ఇవ్వాలి.

– వెంకటేష్, రైతు, పుటాన్‌దొడ్డి

పంటమార్పిడి చేయడం లేదు



రైతులు పంట మార్పిడిని చేయకుండా ఒకే రకం పంటను ప్రతిసారి సాగుచేయడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. పచ్చిరొట్టె ఎరువులను, సేంద్రియ ఎరువులను వినియోగించడంలేదు. రసాయనిక ఎరువులపై ఆధారపడి పంటలను సాగుచేస్తున్నారు.

– సక్రియనాయక్, ఏడీ, అలంపూర్

భగీరథ మహర్షికి ఘన నివాళి



గట్టులో భగీరథ మహర్షికి నివాళులర్పిస్తున్న సగర సంఘం నాయకులు



అయిజ మండలం బింగుదొడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

గట్టు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి సర్పంచు ధనలక్ష్మి, సగర సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయలగూడెంలో వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచు రాణి, సగర సంఘం నాయకులు భగీరథ మహర్షి జయంతిలో పాల్గొని ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో సగర సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, సత్యనారాయణ, గోవిందప్ప, కృష్ణమూర్తి, శ్రీనాథ్, వెంకటేష్, రవి, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భగీరథ మహర్షి జయంతిని నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు నివాళులర్పించారు. బింగుదొడ్డిలో యువకులు ర్యాలీ నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో భగీరథ మహర్షి చిత్రపటానికి సగర సంఘం నాయకులు, సర్పంచ్ జోగుల రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాఘున్న, లక్ష్మన్న, కృష్ణ, రాముడు, పరుశ, రాజేష్, తదితరులు ఉన్నారు.



ఎర్రవల్లి కూడలిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ధరూరు: మండలంలోని మాల్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల ఎదుట సగరుల సంఘం నాయకుడు అంజిసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి జయంతి వేడుకలకు జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీరాములు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేష్, గోపాల్, రంగన్న, గోవిందు, నాగర్‌దొడ్డి నర్సింహులు, మంజు, అంజి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో భగీరథ మహర్షి జయంతి సగర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్‌లు శ్రీరామ్ రెడ్డి, గంగిరెడ్డి, జై శ్రీరామ్ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

అలంపూర్: కేవీపీఎస్ జెండా దిమ్మెను తొలగించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ అధికారులు పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఉన్న కేవీపీఎస్ జెండా తొలగించి దిమ్మెను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గాంధీ చౌక్‌లో మున్సిపల్ అధికారులు చేపడుతున్న పనులను కేవీపీస్ నాయకులు అడ్డుకున్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కేవీపీఎస్ సంఘం నాయకులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దిమ్మెను కూల్చడం సరికాదన్నారు. గతంలో పంచాయతీ తీర్మాణం తీసుకొని జెండాను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో మున్సిపల్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి అందరి సహకారంతో జెండాను తొలగించాలని నిబంధనలు ఉన్నా అవేవి పట్టించుకోకుండా జెండాను తొలగించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జెండాను అదే స్థలంలో పునఃనిర్మించాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాగరాజు, సీఐటీయూ నాయకుడు నరసింహ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ధరూరు: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కర్ని శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా ఎస్పీ సృజన ఆదేశానుసారం మండల జలోని పెద్దపాడులో షీ టీం, పోలీసు కళాజాతా బృందం, భరోసా టీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని నంబర్లను నుంచి కాల్ చేస్తే సమాచారం ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో షీ టీం, కళా బృదం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, రామిరెడ్డి, శేషన్న, పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామస్తులకు గురువారం సైబర్‌నేరాలపై ఎస్ఐ సంతోష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో, వాట్సప్‌లో వచ్చే మెస్సెజ్‌లకు స్పందించకుండా జాగ్రత్తగా వహించాలన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: బాలలను పనిలో పెట్టుకోవద్దని లైఫ్ ఛేంజ్ ఫౌండేషన్ ఫౌండర్ పరుశరాముడు అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని కొండేరులో ఆ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆపదలో ఉన్న చిన్నారులు 1098, పోలీస్ సిబ్బంది కొరకు 100, అంబులెన్స్ కొరకు 108, మహిళల సమస్యల పరిష్కారం కోసం 181 టోల్‌ఫ్రీ నెంబర్‌లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు, మహిళలు, తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామాలలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిషన్ భగరథ నీటిని అందిస్తామని డిప్యూటీ ఈఈ నాగరాజు అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ధర్మవరంలో సర్పంచ్ మధునాయుడు అధ్యక్షతన తాగునీటి సరాఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ తాగునీటి సమస్యపై అధికారులతో చర్చించారు.

విజయవంతం చేయండి

అయిజ: స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని దళిత శక్తి ప్రోగ్రాం మండల ఇన్‌చార్జ్ లక్ష్మణ్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశారాదన్ మహరాజ్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభ ఈ నెల 30వ తేదీన ఎల్‌బీనగర్ సరూర్ నగర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భరత్, సుమన్, రెడ్డయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే వినతి



గద్వాల రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని గురువారం హైదరాబాద్‌లో మినిస్టర్ క్వార్టర్స్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రొబేషనరీ పిరియడ్‌ను సర్వీస్ పిరియడ్‌గా గుర్తించాలని, సర్వీస్‌లో చనిపోయిన జెపీఎస్, ఓపీఎస్‌ల కుటుంబాలకు ఆర్థికసాయం చేసి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

ఇళ్ల పట్టాలను అప్పగించండి

అలంపూర్: గతంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలను తిరిగి తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాలని తహసీల్దార్ సుభాష్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీలో 2007లో సర్వే నెంబర్ 466, 468లో 8.13 ఎకరాల్లో ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విచారణ నిమిత్తం లబ్ధిదారులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల పట్టాలను తిరిగి స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకు లబ్ధిదారులు తమ ఒరిజినల్ పట్టాను, ఆధార్ కార్డు, సెల్ నెంబర్, ప్రస్తుతం నివాసం ఉన్న చిరునామా, ఇంటి నెంబర్, రేషన్ కార్డులను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి రశీదు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఆరాధన ఉత్సవాలు



అయిజ: మండలంలోని మేడికొండలో గురువారం రాత్రి గుడికల్ అల్లిపీరా స్వామి ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆరాధన ఉత్సవాలకు హాజరైన అల్లిపీరా స్వామి భక్తులకు ఉపదేశం చేశారు. ప్రతి ఒక్కరు భగవంతుడిపట్ల భక్తి భావం కలిగి ఉండాలని, ఆధ్యాత్మికతతోనే మనుషులు సన్మార్గంలో నడుస్తారని అన్నారు. పరులకు ఉపకారం చేయాలని, ఉన్నంతలో సంతృప్తిగా జీవించాలన్నారు. ఆరాధన ఉత్సవాలకు వివిధ మండలాలనుంచి భక్తులు తరలివచ్చారు.సంకాపురం రాముడు, అజయ్, రవిబాబు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణ రక్షణ

మానవపాడు: ఆకస్మికంగా గుండెపోటు వచ్చినవారికి సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని డాక్టర్ మధు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ రిజ్వాన్ తాన్వీర్ అధ్యక్షతన ఉద్యోగులకు ఆయన సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఎవరికైనా ఆకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టు అయినప్పుడు సీపీఆర్, ఏఈడీ చేస్తే ప్రమాదం నుంచి కాపాడొచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ రమణారావు, ఎంపీఓ ఆంజనేయరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా, ఆర్ఐ రజానీ కాంత్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

మల్దకల్: మండలంలోని అమరవాయి, మల్దకల్ గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు వివిధ పనుల్లో నిమగ్నం అయ్యారు. గురువారం ఆయా గ్రామాల్లో 200 మందికి పైగా కూలీలు కంపచెట్ల తొలగింపు పనులను చేపట్టారు. జాబుకార్డులు కలిగిన కూలీలందరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య కూలీలకు సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మల్దకల్: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కల్యాణోత్సవం గురువారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను మాడవీధులలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులు కల్యాణతంతను జరిపించారు. మండల కేంద్రంతో పాటు గట్టు, అయిజ, గద్వాల పట్టణాలకు చెందిన విశ్వబ్రాహ్మణులు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీహరి, కిషోర్, బాలకృష్ణ, తరుణ్, పరమేశ్వరచారి, గంగన్న, శ్రీను, లక్ష్మణ్, కృష్ణ, బీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని వీఓఏల నిరసన



మల్దకల్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న వీఓఏలు



ధరూరు ఐకేపీ కార్యాలయం ఎదుట..

మల్దకల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వీఓఏలు మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శిబిరం కొనసాగింది. కార్యక్రమంలో బాషా, చంద్రాములుజనార్దన్, కృష్ణ, తిమ్మప్ప, గోవిందు, లోక్‌నాథ్, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఏస్తేర్, తిరుమలేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వీఓఏల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, వీఓఏలు ఉన్నారు.

ధరూరు: రాష్ట్ర వ్యాప్తంగా వీఓఏలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఏఓలు చేపట్టిన సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరింది. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో నిరసన తెలిపారు. సెర్ప్ ఉద్యోగులుగా, ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి, భీమేష్, భాగ్యలక్ష్మి, పావని, రూతమ్మ, తిమ్మప్ప, శివన్న, సత్యనారాయణమ్మ, సరస్వతి, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే మల్లమ్మ కుంట జీఓ



మాట్లాడుతున్న ఎనుముల నాగరాజు

శాంతినగర్: ఎన్నికల కోసమే మల్లమ్మకుంట జీఓను ప్రభుత్వం విడుదల చేసిందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఎనుముల నాగరాజు అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కజొన్న, మిరప, పత్తి రైతులు మద్దతు ధరలు లేక దళారుల చేతిలో మోసపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, దేవేంద్ర, చిన్నబాబు, బతుకన్న, పచ్చర్ల కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీటీ నిర్మాణానికి నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: చిన్నోనిపల్లె పునరావాస కేంద్రం నుంచి అయిజ మండలం భూంపురం గ్రామం వరకు నిర్మించనున్న బీటీరోడ్డుకు నిధులు మంజూరైనట్లు ఎంపీపీ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో చిన్నోనిపల్లె సర్పంచు ఉమాదేవి, మిట్టదొడ్డి సర్పంచు నర్సింహులు, బల్గెర సర్పంచు హనుమంతునాయుడులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2.7 కిలోమీటర్లకు గాను రూ.2.47 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. గట్టు, అయిజ మండలాలను అనుసంధానం చేస్తూ బీటీ రోడ్డు నిర్మిస్తునట్లు తెలిపారు. మిట్టదొడ్డి, అంతంపల్లి, భూంపురం, లింగాపురం, చాగదోన, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లే నాగల్‌దిన్నె బ్రిడ్జి వరకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. సమావేశంలో రాయాపురం ఎంపీటీసీ రంగస్వామి, మాజీ ఎంపీటీసీ బుడ్డప్ప ఉన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రసూనరాణి

అలంపూర్ రూరల్: గర్భిణుల ఆరోగ్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు వైద్యాధికారి ప్రసూనరాణి అన్నారు. గురువారం మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో గర్భిణులకు బీపీ, షుగర్ బరువు, తదితర పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆరోగ్య పర్యవేక్షకురాలు మల్లమ్మ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఏఎన్ఎం, వైద్య సిబ్బందితో నెల వారి సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 20 నుంచి 60 ఏళ్లలోపు స్త్రీలకు 8 రకాల జబ్బులకు పరీక్షించి అవసరమైన వారికి మందులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంతం, హెచ్ఏ బాలీశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మల్దకల్: చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి అన్నారు. గురువారం మల్దకల్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే సెంటర్లను నిర్వహించాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు నాగరాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న డీకే అరుణ



ప్రాణేష్‌ను పరామర్శిస్తున్న డీకే అరుణ

అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామం స్టేజీ సమీపంలో మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన ప్రాణేష్ గురువారం రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. అదేసమయంలో అయిజ నుంచి గద్వాలకు వెళ్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రమాదాన్ని గమనించి కారును ఆపి గాయపడిన ప్రాణేష్‌ను ఆమె అనుచరుల కారులో గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని డీకే అరుణ కోరారు.